సాక్షి
మంచిర్యాల
సోమవారం । 23 । జూన్ । 2025



అడవిలో యాంటీపోచింగ్ షెడ్లు
వన్యప్రాణుల సంరక్షణకు కృషి చేస్తున్న యాంటీ పోచింగ్ సిబ్బందికి అటవీశాఖ నివాస సౌకర్యం కల్పించింది. అడవిలో అందమైన షెడ్లు నిర్మించింది. 8లో▸



కర్షకులకు 'కర్ర'ంట్ కష్టాలు..!
దండేపల్లి మండలంలోని పొలాల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. రైతులు కర్రలను ఆధారంగా పెట్టి ప్రమాదాలు జరగకుండా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. 9లో▸



గరిష్టం/కనిష్టం
36.0 /28.0

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అక్కడక్కడా చిరుజల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ర్యాలీ గ్రామ పంచాయతీలో 60 మంది లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు భూమి పూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాలైన నాగారం, ర్యాలీ, చిన్నగోపాల్‌పూర్ తోపాటు గఢ్‌పూర్ గ్రామాల పరిధిలోని అర్హులకు సంక్షేమ పథకాల లబ్ధి చేకూరేలా చూస్తామని అన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అంతకు ముందు గిరిజనులు మంగళహారతులు, సంప్రదాయ నృత్యాలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్డీవో గూడూరు శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండే, ఎంపీడీవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



అజయ్‌తో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి అజయ్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాల మైదానంలో శనివారం జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలుర జూనియర్ ఫుట్‌బాల్ ఎంపిక పోటీల్లో అతడు ప్రతిభ కనబరిచాడు. అజయ్‌ను ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయుడు రేణి రాజయ్య అభినందించారు.

కబడ్డీ క్రీడాభివృద్ధికి కృషి



వీరేశ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న క్రీడాకారులు

శ్రీరాంపూర్: రాష్ట్రంలో కబడ్డీ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కాసాని వీరేశ్ తెలిపారు. కబడ్డీ క్రీడాకారులకు మినీ అకాడమీ స్థలాన్ని పరిశీలించడానికి ఆదివారం మంచిర్యాలకు వచ్చారు. నస్పూర్ కలెక్టరేట్ కమాన్ వద్ద జిల్లా కబడ్డీ అసోసియేషన్ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో కబడ్డీ క్రీడాకారులు అనేకమంది ఉన్నారన్నారు. జాతీయ స్థాయి ఆటగాళ్లను మరింత ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.రాంచందర్, అథ్లెటిక్స్ అసోయేషన్ జిల్లా అధ్యక్షుడు సాంబమూర్తి, క్రీడాకారులు కార్తీక్, శ్రీధర్, లింగయ్య, ఉపేందర్, రాజేందర్, మంజుల పాల్గొన్నారు.

పీజీ పట్టా పొందిన డీఎంహెచ్‌వో



డాక్టర్ హరీశ్‌రాజ్

మంచిర్యాలటౌన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ హరీశ్‌రాజ్ ఎన్టీఆర్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(విజయవాడ)లో మైక్రో బయాలజీ(ఎండీ) చేసి పీజీ పట్టా పొందారు. 61 ఏళ్ల వయస్సులో డీఎంహెచ్‌వోగా పనిచేస్తూనే ఈ ఏడాది మేలో పీజీ పరీక్షలు రాయగా, ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించారు. 1985లో కాకతీయ యూనివర్శిటీలో ఆయన ఎంబీబీఎస్ పూర్తి చేసి ఆదిలాబాద్ జిల్లా మెడికల్ ఆఫీసర్‌గా మొదటిసారి విధుల్లో చేరారు. అనంతరం ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలో డిప్యూటీ సివిల్ సర్జన్, డిస్ట్రిక్ట్ ఇమ్యూనైజేషన్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2017లో సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొంది వరంగల్ డీఎంహెచ్‌వోగా చేరారు. మహబూబాబాద్‌లో పనిచేశారు. ఆగస్టులో ఉద్యోగ విరమణ పొందుతుండగా, అంతకుముందే పీజీ పట్టా పొందడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

సీఎంఆర్‌పై సీరియస్!



- మిల్లర్ల ఖాయిలపై కఠినతరం
- రంగంలోకి ఈడీ దిగే అవకాశం
- ఇప్పటికే ఆర్ఆర్, క్రిమినల్ కేసులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సీఎంఆర్ (కస్టం మిల్లింగ్ రైస్) బకాయిలపై ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరిస్తోంది. ఇప్పటికే సీఎంఆర్ బకాయిల రికవరీపై చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నారు. ఆయా సీజన్లలో ధాన్యం తీసుకుని సకాలంలో పౌరసరఫరాల శాఖకు బియ్యం ఇవ్వని మిల్లర్లను డీఫాల్టర్లుగా ప్రకటించారు. అంతేకాకుండా గత వానాకాలం నుంచే జిల్లాలో అనేక మంది మిల్లర్లు సీఎంఆర్‌కు దూరమయ్యారు. బియ్యం ఇవ్వకుండా పలుమార్లు నోటీసులు, అధికారులకు స్పందించని వారిపై రెవెన్యూ రికవరీ (ఆర్ఆర్) యాక్టు కింద కేసులు నమోదయ్యాయి. కొంతమందిపై ఆర్ఆర్ యాక్టుతో పాటు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. మొత్తంగా జిల్లాలో 20 మందికి పైగా కేసులు నమోదు చేశారు. మొదట కేసులు నమోదు చేసే సమయంలోనే రూ.133 కోట్ల బకాయిలు ఉన్నట్లు తేల్చారు. ధాన్యం విలువకు వడ్డీతో సహా లెక్కగట్టి వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆర్ఆర్‌యాక్టు అమలు చేసేందుకు మిల్లర్ల చర, స్థిర ఆస్తుల వివరాలు సైతం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో చాలామంది ఈ యాసంగి సీజన్ ఆరంభంలోనే మళ్లీ మిల్లు ట్యాగింగ్ పొందేందుకు చెల్లిస్తున్నారు. ఇక 2022–23 యాక్షన్ ధాన్యానికి సంబంధించిన బకాయిలపైనా రికవరీలు జరుగుతున్నాయి. ప్రస్తుతం మిల్లర్లు గతేడాది రెండు సీజన్ల సీఎంఆర్ కింద బియ్యం అప్పగిస్తున్నారు.

జిల్లాలో సీఎంఆర్ వివరాలు (టన్నుల్లో)

సంవత్సరం	సీజన్	లక్ష్యం	పెండింగ్
2023-24	రబీ	57,832	9,199.870
2024-25	ఖరీఫ్	53,689	21,424.680
2024-25	రబీ	59,958	55,047.190



రంగంలోకి ఈడీ?
సీఎంఆర్‌కు సంబంధించిన ధాన్యం బకాయిలు రూ.కోట్లలో ఉన్న మిల్లులపై ఇప్పటికే పలు రకాలుగా చట్టప్రకారం ముందుకు వెళ్తుండగా ఇక ఈడీ (డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్) సైతం రంగంలోకి దిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మిల్లర్లు ధాన్యం పక్కదారి పట్టించి జరిపిన ఆర్థిక లావాదేవీలపై విచారణ జరపనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో రూ.వందల కోట్లలో ఉన్న బకాయిలపై కఠినంగా వ్యవహరించాలని పౌరసరఫరాల శాఖ యోచిస్తున్న నేపథ్యంలో కఠిన చర్యలు తప్పేలా లేవు. దీంతో ఆర్థిక లావాదేవీలపై కేంద్ర దర్యాప్తు సంస్థ విచారణ మొదలుపెడితే తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ధాన్యం అమ్మడం నుంచి ఆ మొత్తంతో ఇతర ఆస్తులు కొనుగోలు చేసి పెట్టుబడులు జరిపిన నగదు మళ్లింపు, ఇతర క్రయ విక్రయాలన్నింటిని విచారణ చేసే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఈడీ దర్యాప్తు మొదలైతే జిల్లాలోనూ పెద్దమొత్తంలో బకాయిలు ఉన్న మిల్లర్లకు ఇబ్బంది కలిగే అవకాశం ఉంది.

పొరుగు జిల్లాలకే అధికం
స్థానికంగానే ధాన్యం ఇచ్చేందుకు మిల్లులకు అవకాశం ఉన్నా బకాయిల కారణంగా గత రెండు సీజన్లలోనూ ట్యాగింగ్‌కు దూరమయ్యాయి. ఈ యాసంగిలో జిల్లాలోని 22 మిల్లులకే అవకాశం ఇచ్చారు. ఇక పొరుగు జిల్లాలైన కరీంనగర్‌లోని 68 మిల్లులకు, పెద్దపల్లిలోని 110 మిల్లులకు ట్యాగింగ్ ఇచ్చారు. మొత్తంగా ఈ సీజన్‌లో 1.99 లక్షల మెట్రిక్ టన్నులు మిల్లులకు అప్పగించారు. అయితే ఈ ధాన్యం ఇచ్చేందుకు కూడా గత వానాకాలం నుంచి బ్యాంకు గ్యారెంటీలు తప్పనిసరి చేశారు. ధాన్యం విలువలో కనీసం పదిశాతం బ్యాంకు గ్యారెంటీ తీసుకున్నారు. గత సీజన్‌లో ఇంకా బకాయి ఉంటే 20 శాతం వరకు ఇవ్వాల్సిరావడంతో బకాయిలు ఉన్న స్థానిక మిల్లులకు ధాన్యం ఇవ్వడం నిలిచిపోయింది.

ట్రిపుల్‌ఐటీకి 20,258 దరఖాస్తులు

- జూలై 4న సెలక్షన్ లిస్ట్ విడుదల
- 7 నుంచి ధ్రువపత్రాల పరిశీలన



బాసర ట్రిపుల్‌ఐటీ

భైంసా: 2025–26 విద్యాసంవత్సరానికి బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 20,258 దరఖాస్తులు వచ్చాయి. ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశానికి పదో తరగతిలో ఉత్తీర్ణులైనవారి నుంచి ఈ నెల 21వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. 1,500 సీట్లుండగా ఒక్కో సీటుకు 14 మందికిపైగా పోటీపడుతున్నారు.

క్రమంగా తగ్గుతున్న పోటీ
ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి క్రమంగా విద్యార్థుల దరఖాస్తుల సంఖ్య తగ్గుతోంది. 2020–21 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం 32వేల మంది, 2021–22లో 20,178, 2022–23లో 31,432, 2023–24లో 32,635, 2024–25లో 15వేలు, 2025–26 విద్యాసంవత్సరంలో 20,258 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులు పరిశీలించి జూలై 4న సెలక్షన్ లిస్ట్ విడుదల చేస్తామని ట్రిపుల్‌ఐటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. జూలై 7నుంచి సర్టిఫికెట్లు పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యా విధానం ఇలా..
ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సులో భాగంగా తొలి రెండేళ్లు ఇంటర్ తత్సమాన పీయూసీ బోధిస్తారు. ఇందులో మెరిట్ ఆధారంగా నాలుగేళ్ల బీటెక్ కోర్సుకు వివిధ బ్రాంచ్‌లలో సీట్లు కేటాయిస్తారు. బీటెక్‌లో సివిల్, కెమికల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, ఈసీఈ, ఎంఎంఈ కోర్సులు బోధిస్తారు.

క్యాంపస్‌లో వసతులు
ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, యూనిఫాంలు, షూస్, స్పోర్ట్స్ డ్రెస్ ఇస్తారు. హాస్టల్, భోజన వసతి యూనివర్సిటీలోనే ఉంటుంది. ఆటలు, వ్యాయామం, సాంస్కృతిక రంగాల్లో రాణించేందుకు తరగతులు నిర్వహిస్తారు. క్యాంపస్‌లోనే ప్రత్యేక వైద్యశాల, అధునాతనమైన ల్యాబ్స్, డిజిటల్ లైబ్రరీలు అందుబాటులో ఉన్నాయి.

దేశానికి కమ్యూనిస్టులు అవసరం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు
- ముగిసిన సీపీఐ జిల్లా నాలుగో మహాసభ



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పాతమంచిర్యాల: దేశానికి, సమాజానికి కమ్యూనిస్టుల అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎం కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన సీపీఐ జిల్లా నాలుగో మహాసభ ముగింపు సమావేశానికి హాజరై మాట్లాడారు. దేశంలో అసంఘటిత రంగాల్లో కోటిమంది ఉన్నారని, వారి కోసం కమ్యూనిస్టు పార్టీ ఉంటుందన్నారు. సామ్రాజ్యవాద దేశాల కనుసన్నల్లోనే మన దేశంలో పరిపాలన సాగుతుందని విమర్శించారు. 2026 నాటికి మావోయిస్టులు లేకుండా చేస్తామని చెబుతున్న ప్రభుత్వం.. దేశంలో నిరుద్యోగం, అవినీతి, అసమానతలు, పేదరికం లేకుండా చేస్తామని ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులు, ఆదివాసీలను అమానుషంగా చిత్రహింసలకు గురిచేసి చంపుతున్నారని ఆరోపించారు. అంతకుముందు సమావేశ ప్రాంగణం ఆవరణలో ఏర్పాటు చేసిన అరుణ పతాకాన్ని పార్టీ సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య ఆవిష్కరించారు. అమరవీరుల స్తూపం వద్ద ఇటీవల అమరులైన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు నంబాల కేశవరావు, గాదర్ల రవి, భాస్కర్‌తోపాటు పార్టీ సభ్యులకు నివాళులర్పించారు. విమాన ప్రమాదంతోపాటు పహల్గాం ఉగ్రదాడిలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి కోసం మౌనం పాటించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, వాసిరెడ్డి సీతారామయ్య, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు మిట్టపల్లి వెంకటస్వామి, ఖలిందర్ అలీఖాన్, పౌలు, లింగం రవి, మిరియాల రాజేశ్వర్ రావు, బొల్లం పూర్ణిమ, రేగుంట చంద్రకళ, బొల్లం తిలక్, వనం సత్యనారాయణ, ఇప్పకాయల లింగయ్య పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక
సీపీఐ జిల్లా నాలుగో మహాసభల సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా కార్యదర్శిగా రామడుగు లక్ష్మణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోగా, కార్యవర్గ సభ్యులుగా 16 మంది, కౌన్సిల్ సభ్యులుగా 51 మందిని ఎన్నుకున్నారు. కాగా, రామడుగు లక్ష్మణ్ ఇప్పటికే జిల్లా కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

ఈజీఎస్ పనులు పరిశీలన



ఇంకుడుగుంత పరిశీలిస్తున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్: మండలంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను ఆదివారం కేంద్ర జలశక్తి అభియాన్ టీం అధికారులు పరిశీలించారు. ఆకెనపల్లి, పాతబెల్లంపల్లి, కన్నాల, అంకుశం, బుధాకుర్దు, బుధాకలాన్, గురిజాల, మాలగురిజాల, బట్వాన్‌పల్లి, దుగ్నెపల్లి, పెర్కపల్లి గ్రామాల్లో ఇంకుడు గుంతలు, చెరువుల్లో నిర్మించిన ఫారమ్ పాండ్స్, ఫిష్ పాండ్స్‌ను టీం అధికారి కె.రాంబాబు తనిఖీ చేశారు. జలశక్తి అభియాన్ పనులు ఏవిధంగా ఉన్నాయి, వాటితో ఎంతమేరకు నీటిని పొదుపు చేయగలుగుతున్నారు.. అనే అంశాలపై ఆరా తీశారు. నీటిని పొదుపుపై గ్రామీణులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం రాంబాబును మండల అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్, డీఆర్‌డీవో కార్యాలయ అధికారి సదానందం, ఏపీవో ఏస్తర్ డేవిడ్, ఈసీలు సత్యనారాయణ, అనిత్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం



సాహితీ ప్రసంగం చేస్తున్న నందమయ్య

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్‌లో ఆదివారం సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. విశ్రాంత అభియంత సాధు నందమయ్య మాట్లాడుతూ తెలుగు కవి, హాస్యకవి, వికటకవిగా పేరొందిన తెనాలి రామకృష్ణ ఎన్నో అద్భుత కావ్యాలు రచించారన్నారు. భువన విజయంలో ఓ కవి ఇచ్చిన సమస్యకు ఎంతో చక్కని పూర్ణ చమత్కార పద్యాలు ఉదహరించారని తెలిపారు. ఉద్దటారాధ్య చరిత్ర, పాండురంగం మహాత్యం, ఘటికాచల మహాత్యం గురించి వివరించారు. కవులు పెద్ది భరత్, మల్యాల మురళీకృష్ణ, మైసమ్మ కవితాగానం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వామన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డీఐఈవో కార్యాలయంలో సర్టిఫికెట్లు ఇవ్వాలి

మంచిర్యాలఅర్బన్: ప్రతిభ కాలేజీకి చెందిన విద్యార్థుల సర్టిఫికెట్లు డీఐఈవో కార్యాలయంలోనే అందజేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఇద్దరు వ్యక్తులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అధిక ఫీజులు వసూలు చేస్తూ.. సర్టిఫికెట్లపై ప్రిన్సిపాల్ సంతకం కాకుండా వేరేవారి సంతకం చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. సర్టిఫికెట్లను డీఐఈవో స్వాధీనం చేసుకుని ఫీజులు లేకుండా అందించాలని కోరారు. సెకండియర్ చదివే వారికి నచ్చిన కాలేజీలో అడ్మిషన్లు తీసుకునేలా అవకాశం కల్పించాలన్నారు.

బీసీల్లో రాజకీయ చైతన్యం రావాలి



పుస్తకం ఆవిష్కరిస్తున్న నరహరి, నాయకులు

పాతమంచిర్యాల: బీసీల్లో రాజకీయ చైతన్యం రావాలని ఓబీసీ పోరుబాట పుస్తక రచయిత, ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి అన్నారు. జిల్లా కేంద్రంలోని నార్త్ ఇన్ హోటల్‌లో ఆదివారం పుస్తకం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బీసీలు సామాజిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని, వారిని చైతన్యం చేయడానికి పుస్తకాన్ని రచించినట్లు తెలిపారు. బీసీలు ఎలాంటి ఉద్యమాలు చేయాలో, తమ హక్కుల కోసం ఎలా పోరాడాలో పుస్తకంలో వివరించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ ఉద్యమ నేత ప్రసన్న హరికృష్ణ, టీబీజీకేస్ నాయకులు కెంగెర్ల మల్లయ్య, నాయకులు సంధ్యారాణి, నరెడ్ల శ్రీనివాస్, నీలి శ్రీనివాస్, భావన రుషి, గాజుల ముఖేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

డయేరియాపై సమరం

- జూలై 31 వరకు కార్యక్రమాలు
- ఐదేళ్లలోపు చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్లు పంపిణీ
- అతిసారను అడ్డుకోవడమే లక్ష్యం

ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్లు అందుబాటులో ఉన్న కేంద్రాలు

అంగన్‌వాడీ కేంద్రాలు	969
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	17
అర్బన్ హెల్త్ సెంటర్లు	5
సబ్‌సెంటర్లు	149
కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు	3
ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి	1



చిన్నారులకు ఓఆర్ఎస్ కలిపిన నీటిని తాగిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాం అధికారి అనిత

మంచిర్యాలటౌన్: డయేరియా నిర్మూలనకు వైద్య ఆరోగ్యశాఖ నడుం బిగించింది. ఐదేళ్లలోపు చిన్నారులు వందమంది మృతి చెందితే.. అందులో 4.8 శాతం మంది డయేరియాతో ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్టాప్ డయేరియా క్యాంపెయిన్(అతిసార వ్యాధి నిరోధక అవగాహన కార్యక్రమం)ను చేపట్టాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 16 నుంచి జూలై 31 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డయేరియా రావడానికి ప్రధాన కారణం కలుషితమైన తాగునీటిని తీసుకోవడమే. వర్షాల సమయంలో పైపులైన్లు పగలడం, ట్యాంకుల్లో కలుషిత నీరు చేరడం, తాగేనీటితో పాటు తినే ఆహారం కలుషితమైనా, వ్యక్తిగత పరిశుభ్రత లేకున్నా సోకుతుంది. పసిపిల్లల నుంచి పెద్దలకు అందరికీ వచ్చే సాధారణ వ్యాధి. నీళ్ల విరేచనా లు అయితే నార్మల్ డయేరియాగా, రక్తం, బంకతో వచ్చే విరేచనాలను డిసెంట్రీగా పిలుస్తారు. పిల్లల్లో వచ్చే ఈ వ్యాధికి రోటా వైరస్ కారణమైతే.. నోరో వైరస్‌లతో పెద్దలకు సోకుతుంది. రకరకాల ఫంగల్ ఇన్ఫెక్షన్లు, బ్యాక్టీరియా, జీర్ణ వ్యవస్థ దెబ్బతినడం, ఫుడ్ పాయిజనింగ్ కూడా డయేరియాకు దారి తీస్తాయని వైద్యులు చెబుతున్నారు. బాధితుల శరీరంలో నీటిశాతం, లవణాలు తగ్గిపోయి నీరసంగా తయారవుతారు. సరిపడా లవణాలు అందించకుంటే డీహైడ్రేషన్ ఎక్కువై పరిస్థితి ప్రమాదకరంగా మారుతుంది. ఒంట్లోని పోషకాలు, లవణాలన్నీ విరేచనాలతో బయటకు వెళ్లి ఒక్కోసారి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అందుకే లక్షణాలను వెంటనే గుర్తించి ఓఆర్ఎస్ నీటిలో కలుపుకుని తాగడం, జింక్ ట్యాబెట్లు వేసుకోవడం ద్వారా తీవ్రతను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొన్నారు.

పిల్లలు జాగ్రత్త..
ఐదేళ్లలోపు పిల్లలకు డయేరియా సోకితే డీహైడ్రేషన్ ఎక్కువై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. జింక్, విటమిన్ ఏ సప్లిమెంట్స్‌ను అందిస్తే ప్రాణపాయం తప్పించొచ్చు. పిల్లలకు రోటా వైరస్ వ్యాక్సిన్ ఇవ్వడం ద్వారా డయేరియా ప్రమాదాన్ని తగ్గించవచ్చు. రెండేళ్లు వచ్చే వరకు పిల్లలకు తల్లిపాలు ఇస్తే ఇమ్యూనిటీ పెరిగి, డయేరియాతోపాటు, ఇతర వ్యాధుల బారిన పడకుండా ఉంటారు. ప్రస్తుతం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రతీ ఇంటికి ఆశ, ఆరోగ్య కార్యకర్తలు వెళ్లి ఐదేళ్లలోపు పిల్లలు ఉన్న ఇంట్లో రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్లు 14 రోజులకు లెక్కించి ఇస్తున్నారు. 2 నెలల నుంచి 6 నెలల పిల్లలకు 10 ఎంజీ(సగం) ట్యాబ్లెట్‌ను ఒకరోజు చొప్పున 14 రోజుల పాటు ఇస్తుండగా, 6 నెలల నుంచి 5 ఏళ్లలోపు పిల్లలకు 20 ఎంజీ ట్యాబ్లెట్‌ను 14 రోజులకు రోజుకు ఒకటి చొప్పున ఇస్తున్నారు. రెండు నెలల వరకు విరేచనాలు కాకుండా జింక్ కాపాడుతుండడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చిన్నారులు డయేరియా బారినపడకుండా కాపాడుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. 9 నెలలు దాటిన పిల్లలకు ప్రతీ ఆరు నెలలకు ఒకసారి విటమిన్ ఏ తప్పనిసరిగా వేయడం, 6, 10, 16 వారాలకు ఆర్‌వీవీ వ్యాక్సిన్ ఇవ్వడం వల్ల పిల్లల్లో ఇమ్యూనిటీ పెరిగి వ్యాధులు రాకుండా ఉంటాయి.

లక్షణాలు..
డయేరియా సోకినప్పుడు విరేచనాలతోపాటు జ్వరం, వాంతులు, దాహం ఎక్కువ కావడం, నీరసం, గుండెదడ, నోరు ఎండిపోవడం, చర్మం పొడిబారడం, కడుపు నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. పిల్లల్లో డీహైడ్రేషన్ ఎక్కువైతే నాడీ వేగం తగ్గి, కోలుకోవడం కష్టంగా మారుతుంది. వెంటనే వైద్యుల వద్దకు వెళ్తే శరీరం కోల్పోయిన లవణాలు రీప్లేస్ చేసేందుకు గ్లూకోజ్, ఓఆర్ఎస్, కొబ్బరినీళ్లు ఇవ్వడంతో పాటు, విరేచనాలతోపాటు వాంతులు ఉంటే సెలైన్ ఎక్కిస్తారు. తగినంత విశ్రాంతి తీసుకుంటూ మందులు వాడితే వాంతులు, విరేచనాలు తగ్గి వ్యాధి నుంచి బయటపడతారు. వ్యాధిగ్రస్తులు తేలి కగా జీర్ణమయ్యే వాటిని తినడం, పాల పదార్థాలను తగ్గించి, పండ్ల రసాలు, సూప్‌లు ఎక్కువగా తీసుకోవడం, పుల్లటి పండ్లు తినకుండా ఉంటే మంచిది.

కాచి చల్లార్చిన నీటిని తాగించాలి



పిల్లలకు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగించాలి. అపరిశుభ్రమైన పరిసరాల్లోకి వెళ్తే వారి చేతులను సబ్బుతో కడగాలి. తల్లి కూడా పరిశుభ్రతను పాటిస్తూ పాలిచ్చే ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చేతిగోళ్లు పెంచుకోకపోవడం, తినే ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా మూతలు పెట్టడం, పిల్లలకు అప్పుడే వండిన ఆహార పదార్థాలు ఇవ్వడం, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను ఇవ్వకపోవడం మంచిది. వీలైనంత వరకు ఇంట్లో వండిన ఆహారాన్నే తినిపించాలి. బయటి ఆహారంతో డయేరియాతోపాటు, ఇతర వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయి. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.
– డాక్టర్ అనిత, జిల్లా ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాం అధికారి

క్లుప్తంగా

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ


బాధితురాలు భూదమ్మ

చెన్నూర్‌రూరల్: వృద్ధురాలి మెడలో గొలుసును ఇద్దరు చోరీకి పాల్పడ్డారు. మండలంలోని సుబ్బరాంపల్లి సమీపంలో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సుబ్బరాంపల్లి గ్రామానికి చెందిన రాతిపల్లి భూదమ్మ శనివారం పని నిమిత్తం అంగ్రాజ్‌పల్లి గ్రామానికి వెళ్లింది. అక్కడకు ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి మీతో పని ఉందని మీ ఊరికే వెళ్తున్నామని చెప్పి నమ్మించారు. బైక్‌పై తీసుకుని సుబ్బరాంపల్లి సమీపంలో దించి ఆమె మెడలో మూడు తులాల బంగారు గొలుసును లాక్కున్నారు. భూదమ్మ గట్టిగా అరవడంతో ఇద్దరు బైక్‌పై పరారయ్యారు. బాధితురాలి కుటుంబ సభ్యులు చెన్నూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పేకాటస్థావరంపై దాడి

వాంకిడి: పేకాడుతూ పట్టుబడిన 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. మండలంలోని బంబార శివారులో రహస్యంగా పేకాటస్థావరం నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి మఫ్టీలో ఆదివారం దాడులు నిర్వహించారు. 9 మందిని అదుపులో తీసుకుని వారివద్ద రూ.2500 నగదును సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా పేకాట ఆడుతున్నారని తెలిస్తే 87126 70531 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

బ్లేడ్ ట్రాక్టర్ తగిలి మహిళా రైతు మృతి


లక్ష్మి (ఫైల్)

పెంబి: చేనులో చదును చేస్తున్న బ్లేడ్ ట్రాక్టర్ వెనుకకు వచ్చే క్రమంలో నాగలికి తగిలి మహిళా రైతు అక్కడికక్కడే మృతి చెందింది. మండలంలోని నాగాపూర్ గ్రామంలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై హన్మండ్లు కథనం ప్రకారం..గ్రామానికి చెందిన పోతురాజు లక్ష్మి(40) తన చేనులో ఆదివారం బ్లేడ్ ట్రాక్టర్‌తో చదును చేయిస్తున్న సమయంలో డ్రైవర్ నిర్లక్ష్యంతో వెనుకకు వచ్చే క్రమంలో నాగలి ఆమె తలకి తగలి మృతిచెందింది. పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి అనుప ఎల్లయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి భర్త, కుమారుడు, కూతురు ఉంది. భర్త, కుమారుడు ఉపాధి కోసం విదేశాలకు వెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు.


విద్యుత్ షాక్‌తో ఎద్దులు మృతి


జంబుగలో ఎద్దు కళేబరం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని జంబుగ గ్రామంలో ఆదివారం విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి చెందింది. గజ్జిగూడకు చెందిన గాజుల మొండయ్యకు చెందిన ఎద్దు మేతకోసం వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలి అక్కడికక్కడే మృత్యువాతపడింది. దీని విలువ రూ.60 వేలు ఉంటుందని, అధికారులు తనకు పరిహారం ఇప్పించాలని కోరారు. ఈజ్‌గాం ఏఎస్సై హీరామన్, పశువైద్యాధికారులు ఈ సంఘటన స్థలాన్ని సందర్శించి పంచనామా నిర్వహించారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో ఈ ప్రమాదం జరిగిందని బాధితుడు ఆరోపించాడు. అందుకే అధికారుల రాలేదని, తనకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని బాధితుడు తెలిపాడు.

భీమిని: మండలంలోని వెంకటపూర్ పంచాయతీ పరిధిలో ఆదివారం విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందింది. గ్రామ శివారులో మేతకు వెళ్లిన ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్‌కు తగిలి మృతి చెందినట్లు బాధిత రైతు కోట నగేశ్ తెలిపాడు. దీని విలువ రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆర్థికసాయం అందించాలని వేడుకున్నాడు.

ఖాళీ బిందెలతో నిరసన


నిరసన తెలుపుతున్న మహిళలు

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో మిషన్ భగీరథ, గ్రామపంచాయతీ నీళ్ల రాక 15రోజులుగా ఇబ్బందులు పడుతున్నామని మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో మహిళలు ఆదివారం ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన చేపట్టారు. ఎమ్మెల్యే స్పందించి వెంటనే నీటి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా మండల అధ్యక్షుడు అటుకాపురం రమేశ్, నీలాల జయ, నర్సమ్మ, పుష్పలత, స్వప్నా, లావణ్య, రజిని, జ్యోతి, రాజమ్మ, లక్ష్మి తదితరులున్నారు.

అడవిలో యాంటీపోచింగ్ షెడ్లు


అడవిలో నిర్మించిన యాంటీ పోచింగ్ షెడ్డు

- ఇందన్‌పల్లి రేంజ్‌లో నిర్మాణం
- సిబ్బందికి సౌకర్యాలు

జన్నారం: రాత్రి,పగలు అడవిలో తిరుగుతూ వన్యప్రాణుల సంరక్షణ కోసం తమవంతుగా కృషి చేస్తున్న యాంటీపోచింగ్ సిబ్బందికి అటవీశాఖ నివాస సౌకర్యం కల్పించింది. అడవిలో అందమైన షెడ్ల నిర్మాణం చేపట్టింది. వాన, వేసవి, చలికాలాల్లో నీడ సౌకర్యం కోసం, సిబ్బంది బస చేసేందుకు వీలుగా టైగర్‌జోన్‌లోని జన్నారం డివిజన్‌లో మొదటిసారిగా ఇందన్‌పల్లి రేంజ్‌లో షెడ్ల నిర్మాణం చేపట్టింది.

రేంజ్‌లో మూడుచోట్ల

జన్నారం అటవీ డివిజన్‌లోని ఇందన్‌పల్లి రేంజ్‌లో మొదటిసారిగా మూడు చోట్ల యాంటీపోచింగ్ షెడ్లు నిర్మాణం చేపట్టారు. ప్రతి ఏటా వచ్చే నిధులతో ఈసారి సిబ్బంది కోసం షెడ్ల పనులు చేపట్టారు. ఇదిలా ఉంటే ఒక్కో యాంటీపోచింగ్ టీంలో ఐదుగురు సిబ్బంది ఉంటారు. వీరు ఉదయం నుంచి సాయంత్రం వరకు అడవిలోనే తిరుగుతూ వన్యప్రాణులు, అడవుల రక్షణ కోసం పని చేస్తుంటారు. సాయంత్రం, ఉదయం వంట, సామగ్రిని షెడ్లలో ఉంచుకుని తిరిగి రాత్రి ఇక్కడే బస చేస్తారు. సిబ్బంది రాత్రి ఉండేందుకు జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్ ఆదేశాల మేరకు రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ ఈ నిర్మాణాలు చేపట్టారు. వీటి పనులు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలో షెడ్లను ప్రారంభించనున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

ఉన్నతాధికారుల ఆదేశాలతో..



యాంటీపోచింగ్ సిబ్బందికి అడవిలో సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో రేంజ్ పరిధిలో మూడు షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. త్వరలో ప్రారంభిస్తాం.
– కారం శ్రీనివాస్, రేంజ్ అధికారి

సిబ్బంది విధులు

స్మగ్లింగ్ నిరోధానికి అటవీ అధికారులతోపాటు బేస్‌క్యాంపు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరి కోసం ఇప్పటికే డివిజన్‌లో బేస్‌క్యాంపులు నిర్మించారు. వారు రాత్రి, పగలు అడవిలో ఉంటూ స్మగ్లింగ్ నిరోధానికి, అడవుల ఏదైన సమస్య ఉంటే అధికారులకు సమాచారం ఇస్తారు. వన్యప్రాణుల సంరక్షణకు, ఏదైన వన్యప్రాణి గాయపడ్డ అక్కడికి చేరుకుని వాటిని కాపాడటం కోసం యాంటీపోచింగ్ సిబ్బందిని నియమించారు. వన్యప్రాణులకు నీటి సౌకర్యం, ఆహారం కల్పించడానికి అటవీ అధికారుల ఆదేశాల మేరకు పని చేస్తుంటారు. వర్షాకాలంలో గడ్డి పెంపకం, వేసవిలో నీటి సౌకర్యం కోసం పనిచేస్తుంటారు. వీటితోపాటు స్మగ్లింగ్, వేట నిరోధం కోసం అటవీశాఖ అధికారుల ఆదేశాల ప్రకారం పని చేస్తుంటారు.

అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక


ఎంపికైన క్రికెట్ జట్టు

మంచిర్యాలటౌన్: ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-19 ఎంపిక పోటీల్లో 15 మంది క్రీడాకారులను జిల్లా జట్టుకు ఆదివారం ఎంపిక చేసినట్లు కోచ్ ప్రదీప్ తెలిపారు. ఎంపికైన వారిలో మందమర్రికి చెందిన సింహాద్రి, లక్ష్మణ్, రాంయాదవ్, మంచిర్యాల నుంచి ఐ. సందీప్, అశ్రిత్, అక్షయ్, ఆదిలాబాద్ నుంచి దర్ష్ అగర్వాల్, ఇస్రాయేల్, మొహమ్మద్ ఆనస్, రాజబాబు, రాహుల్, అద్నాన్, ముల్కల్లకు చెందిన చరణ్, ఉట్నూర్‌కు చెందిన ముసాదిక్, ఆసిఫాబాద్‌కు చెందిన కార్తికేయ ఉన్నారు. స్టాండ్‌బైలో మంచిర్యాలకు చెందిన జి. సంతోశ్, సాయిరామ్, ఆదిలాబాద్‌కు చెందిన ఎస్‌డి అనస్, సైఫ్ బిన్ సోహైల్, లక్కీ జాదవ్‌లను ఎంపిక చేశారు. జిల్లా జట్టు రాష్ట్రస్థాయి పోటీల్లో త్వరలో నిర్వహించే టోర్నమెంటులో ఆడుతుందని తెలిపారు.

మాస్క్ ధరించి.. బంగారం అపహరించి

- భైంసాలోని ఓ ఇంట్లో 31 తులాలు చోరీ


ఇంట్లో చిందరవందరగా వస్తువులు

భైంసాటౌన్: పట్టణంలోని రాహుల్‌నగర్‌లో శనివారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. బాధితులు, పట్టణ సీఐ జి.గోపీనాథ్ కథనం ప్రకారం.. రాహుల్‌నగర్‌లోని నివాసముంటున్న మచ్చ గజ్జారాం, పంచపూల దంపతులు శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి నర్సాపూర్(జి)లోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం ఇంటి గేటు, తలుపులు తెరిచి ఉండడం గమనించిన స్థానికులు వారి కుమారుడికి సమాచారమిచ్చారు. ఆయన వెంటనే నర్సాపూర్(జి)లో ఉన్న తల్లిదండ్రులకు తెలిపి, భార్యతో కలిసి మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నాడు. లోనికి వెళ్లి వెళ్లి చూడగా బీరువా, వస్తువులు చిందరవందరగా ఉండడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ జి. గోపీనాథ్, ఎస్సై గౌసుద్దీన్ చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనలో 31 తులాల బంగారు ఆభరణాలు, రూ.30 వేల నగదు, ఒక ప్రొఫెషనల్ కెమెరా అపహరణకు గురైనట్లు పేర్కొన్నారు. ఇంట్లో సీసీ పుటేజీ పరిశీలించగా మాస్క్ ధరించిన ముగ్గురు దుండగులు ఇంట్లోకి ప్రవేశించిన దృశ్యాలు నమోదయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

బాలికపై వేధింపులు.. ఎనిమిది మందిపై పోక్సో కేసు

గుడిహత్నూర్: సోషల్ మీడియాలో స్నేహం పేరుతో ఓ బాలికను వేధింపులకు గురిచేసిన కేసులో ఎనిమిది మందిని శనివారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికతో మండల కేంద్రానికి చెందిన ఓ బాలుడు పరిచయం పెంచుకున్నాడు. అప్పటి నుంచి ఫోన్‌లో చాటింగ్ చేస్తున్నాడు. ఒక రోజు తనకు న్యూడ్ వీడియో కాల్ చేయాలని, లేదంటే చాటింగ్ అందరికీ తెలిసేలా చేస్తానని బెదిరించాడు. ఆ బాలిక ఒకరోజు న్యూడ్ కాల్‌చేసి మాట్లాడుతుండగా వీడియోను స్క్రీన్ రికార్డు చేసి తన ఏడుగురు స్నేహితులకు పంపించాడు. వారు వీడియోను అడ్డం పెట్టుకుని బాలికను మానసికంగా వేధింపులకు గురి చేయడం ప్రారంభించారు. ఓ యువకుడు ఏకంగా ఆ వీడియోను సోషల్ మీడియాలో పెట్టడంతో బాలిక తన కుటుంబ సభ్యులకు విషయం తెలిపింది. బాలిక తండ్రి పోలీసులను ఆశ్రయించడంతో షీటీం పోలీసులు ఎనిమిది మందిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో ఇద్దరు మైనర్లు ఉన్నారని తెలిపారు. ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఏఎస్పీ వివరించారు.

ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకున్న వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఆశగిరి హన్మాండ్లుకు వైద్యశాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. శాంతినగర్‌కు చెందిన రంగినేని శ్రీనివాస్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.10 లక్షలు తీసుకుని మోసం చేశాడు. ఉద్యోగం ఇప్పించకుండా రేపుమాపు అంటూ తిప్పుకుంటూ బాధితుడిని ఇబ్బందులకు గురిచేశాడు. ఈనెల 8న బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఆదివారం రంగినేని శ్రీనివాస్ అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

మోసం చేసిన ముగ్గురిపై..

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలో భూ లావాదేవీల్లో మోసం, బెదిరింపులకు పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కర్రె స్వామి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మావల పోలీసు స్టేషన్ పరిధిలోని పలువురు బాధితుల నుంచి ప్లాట్ల కొనుగోలు కోసం డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేసినట్లు వివరించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దాడికి పాల్పడిన ఇద్దరిపై..

జన్నారం: ఇచ్చిన అప్పు డబ్బులు అడిగే క్రమంలో నిర్వహించిన పంచాయితీలో వ్యక్తిపై దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనూష తెలిపారు. ఆదివారం సాయంత్రం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రెండ్లగూడ గ్రామానికి చెందిన నెమలికొండ ఆశరాజ్ అప్పు తీసుకున్న డబ్బులు ఇవ్వాలని ధర్మారానికి చెందిన మగ్గిడి తిరుపతి అతని తమ్ముడు మగ్గిడి వెంకటేశ్‌లు ఈనెల 21న పంచాయితీ నిర్వహించారు. ముత్యం రాజన్న అతను డబ్బుల విషయమై శాంతియుతంగా పరిష్కరించుకోవాలని చెప్పారు. కోపంతో మగ్గిడి తిరుపతి, మగ్గిడి వెంకటేశ్‌లు తనపై దాడి చేశారని ముత్యం రాజన్న ఫిర్యాదుతో ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరిపై అట్రాసిటీ..

నెమలికొండ ఆశరాజ్ డబ్బులు ఇవ్వాలని అడుగగా నన్ను, తమ్ముడు వెంకటేశ్, తల్లి అమృతలను బూతులు తిట్టి, కొట్టారని మగ్గిడి తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముత్యం రాజన్నపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనూష తెలిపారు. ఇరువర్గాలపై నమోదైన కేసులపై దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దాడి చేసిన ఐదుగురిపై..

తానూరు: మండలంలోని జౌలా(బి) గ్రామానికి చెందిన లోకండే భీంరావ్ అతని భార్య రాణిపై దాడిచేసిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై భానుప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..లోకండే తుకారం నూతనంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. ఈనెల 18న గోడలకు నీటిని అందిస్తుండగా భీంరావ్ ఇంటి రేకులపై నీరు పడ్డాయి. ఈక్రమంలో భీంరావ్, తుకారాం మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈనెల 19న రాత్రి మళ్లీ గొడవ జరగడంతో తుకారం అతని కుమారుడు ధమ్మ, కుమార్తె రమాబాయి కుమారులు బబ్లు, కరణ్‌లు భీంరావ్ అతని భార్య రాణిపై కర్రలతో దాడి చేశారు. తీవ్ర గాయాలైన భీంరావ్, రాణి భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తుకారం, ధమ్మ, రమాబాయి, బబ్లు, కరణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై భానుప్రసాద్ తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: మంచిర్యాల-పెద్దంపేట రైల్వేస్టేషన్ల మధ్య ఆదివారం రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మృతుడు మంచిర్యాలలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన వానరాసి మల్లేశ్ (37)గా గుర్తించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వాసుపత్రిలో భద్రపర్చి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఒకరిపై దాడి


తానూరు: మండలంలోని జౌలా(కే) గ్రామానికి చెందిన ఇప్తెకర్ సిద్ధిరాంపై అదే గ్రామానికి చెందిన కొందరు కర్రలతో విచక్షణ రహితంగా దాడి చేసినట్లు ట్రైయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గత వారం క్రితం అదే గ్రామానికి చెందిన ప్రదీప్, సిద్ధిరాంలు ఫోన్ విషయమై మద్యం మత్తులో గొడవపడ్డారు. మాటమాట పెరిగి సిద్ధిరాం ప్రదీప్‌ని కర్రతో కొట్టి అక్కడి నుంచి మహారాష్ట్రకు వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని ప్రదీప్ తన సోదరులకు తెలిపాడు. ప్రదీప్ సోదరులు సిద్ధిరాం రాక కోసం ఎదురుచూశారు. అతను శనివారం సాయంత్రం ఇంటికి వచ్చాడు. ప్రదీప్ సోదరులు, కుటుంబ సభ్యులు అతన్ని హత్య చేయాలనే పథకం పన్ని కర్రలతో విచక్షణ రహితంగా దాడి చేశారు. తీవ్ర గాయాలైన సిద్ధిరాంను కుటుంబ సభ్యులు భైంసా ఆస్పత్రికి తరలించారు. ఈ దాడి దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. విషయం తెలుసుకున్న భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ ఆదివారం జౌలా(కే) గ్రామానికి చేరుకుని జరిగిన ఘటనపై ఆరా తీశారు. సిద్ధిరాం ఫిర్యాదు మేరకు ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై కేసులు నమోదు చేయాలని ట్రైయినీ ఎస్సైకి సూచించారు.

పశువులు పట్టివేత


పట్టుకున్న నిందితులతో పోలీసులు

కౌటాల: మండలంలోని హెట్టి గ్రామం నుంచి అక్రమంగా వాహనాల్లో తరలిస్తున్న పశువులను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై విజయ్ తెలిపారు. శనివారం రాత్రి హెట్టి నుంచి మూడు బొలెరో వాహనాల్లో 18 ఆవులు, 10 దూడలు, 4 ఎద్దులను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామని పేర్కొన్నారు. మూడు బొలెరో వాహనాలు, రెండు కార్లను సీజ్ చేసి పట్టుకున్న 32 పశువులను కౌటాల బంజారు దొడ్డిలో ఉంచినట్లు తెలిపారు. పశువులను అక్రమంగా తరలిస్తున్న షేక్ శుజాఉద్దీన్, అయుబ్‌ఖాన్, హలీద్‌పాషా, జమీర్, మొబీన్, రఫీ, ఫాషీ, అహ్మద్, అబ్దుల్లా, జహీర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అదుపుతప్పిన కారు


గాయపడిన శ్రీధర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని గుల్జార్ మార్కెట్‌లో ఆదివారం కారు అదుపుతప్పిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. ఓ కారు పోలీస్‌స్టేషన్ వైపు నుంచి మార్కెట్ వైపు వస్తూ మసీదు ఎదుట ఉన్న రెండు బజ్జీల బండ్లు, ఒక బైక్‌ను ఢీకొంది. ఘటనలో కారుడ్రైవర్ శ్రీధర్‌తోపాటు గౌస్‌ఖాన్‌కు గాయాలయ్యాయి. షేక్ అహ్మద్‌పై వేడి నూనె పడి గాయపడ్డారు. అజాగ్రత్త వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆదివాసీ యువ రైతు ఐడియా అదుర్స్



ఇంద్రవెల్లి మండలం దోదంద గ్రామానికి చెందిన ఆదివాసీ యువ రైతు తుంరం ధాను వినూత్నంగా ఆలోచించాడు. ఆదివారం తన చేనులో మొక్కజొన్న విత్తనాలు వేసేందుకు సిద్ధమయ్యాడు. ట్రాక్టర్‌పై ఐదుగురు మహిళ కూలీలను కూర్చునేలా ఏర్పాటు చేసి వారితో ఒక్కరోజే 40 బ్యాగుల మొక్కజొన్న విత్తనాలు నాటించి అందరినీ ఆకట్టుకున్నాడు. యువ రైతు ఐడియా అదుర్స్ అంటూ పలువురు కొనియాడారు. – ఇంద్రవెల్లి

ఆత్మీయ సమ్మేళనం



తాంసి మండలం కప్పర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2000-01 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 25 ఏళ్ల తర్వాత వీరి ఆత్మీయ సమ్మేళనానికి పాఠశాల వేదికైంది. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి గుర్తులను నెమరువేసుకున్నారు. ఆటపాటలతో సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం ఆనంద్, పూర్వ ఉపాధ్యాయులు ఆదినాథ్, శ్రీనివాస్, మనోహర్, విజయతోపాటు రఫీ, అనిల్, సరిత, స్వామి, లక్ష్మణ్ పాల్గొన్నారు. – తాంసి

వసతులు కల్పించాలంటూ ఫిర్యాదు


మాట్లాడుతున్న అపార్ట్‌మెంట్ వాసులు

నస్పూర్: పట్టణ పరిధిలోని సీసీసీ కార్నర్ వద్ద గల తిరుమల డెవలపర్స్ అపార్ట్‌మెంట్‌లో మౌలిక వసతులు కల్పించడం లేదంటూ యజమానులపై అపార్ట్‌మెంట్ వాసులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. యజమానులు అనుమల్ల వెంకట్‌రెడ్డి, పెరుక ప్రతాప్, గుజ్జల ప్రశాంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీస్‌స్టేషన్ ఎదుట అపార్ట్‌మెంట్ వాసులు మాట్లాడుతూ 2013లో నస్పూర్ శివారు సర్వేనంబర్ 94లో తిరుమల డెవలపర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అపార్ట్‌మెంట్‌లో మొత్తం 48 ఫ్లాట్లు ఉన్నాయని పేర్కొన్నారు. చాలా ఏళ్లుగా లిఫ్టులు, కాంపౌండ్ వాల్, సీసీ కెమెరాలు, మెట్ల పక్కన రెయిలింగ్ ఏర్పాటు చేయలేదని, ఎర్తింగ్ లేదని, ఫ్లోరింగ్ అసంపూర్తిగా ఉందన్నారు. అపార్ట్‌మెంట్ వాసులు లక్ష్మారెడ్డి, రాంచందర్, సత్తయ్య, లక్ష్మి, భవాని, పద్మ పాల్గొన్నారు.

పంగిడి అడవుల్లో అలుగు వేట


వివరాలు వెల్లడిస్తున్న ఎఫ్‌డీవో భవానీ శంకర్


స్వాధీనం చేసుకున్న అడవి అలుగు

- 10 మందిపై కేసు నమోదు, అరెస్టు
- వెల్లడించిన ఎఫ్‌డీవో భవానీ శంకర్

ఖానాపూర్: నిర్మల్ జిల్లా దిమ్మదుర్తి అటవీ రేంజ్ పరిధిలోని ఖానాపూర్ మండలం బావాపూర్(ఆర్) పంచాయతీ పరిధి పంగిడి గూడెం అడవుల్లో అడవి అలుగును కొందరు వేటాడినట్లు ఎఫ్‌డీవో భవానీ శంకర్, ఎఫ్‌ఆర్వో కిరణ్ తెలిపారు. ఖానాపూర్ పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయంలో ఆదివారం కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 19న ఖానాపూర్ మండలం జగన్నాథ్‌రావు చౌరస్తాలో కారులో వెళ్తున్న ముగ్గురితోపాటు అలుగు అవశేషాలు పట్టుకుని విచారించారు. అలుగును అడవి సారంగాపూర్‌కు తరలించి అక్కడి నుంచి క్రయవిక్రయాలు చేసే ముఠా సభ్యులకు చేరవేస్తున్నట్లు గుర్తించారు. ఈ ముగ్గురిని విచారించగా మరో ఏడుగురు నిందితులు ఉన్నట్లు గుర్తించి, మొత్తం పది మందిపై కేసు నమోదు చేశారు. ఇందులో పట్టుకున్న వారిలో నిర్మల్, జగిత్యాల, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన వారు ఉన్నారని ఎఫ్‌డీవో, ఎఫ్‌ఆర్వో పేర్కొన్నారు.

అక్రమ మార్గంలో సంపాదించేందుకే..

అక్రమ మార్గంలో సంపాదించేందుకే అడవి అలుగుకు ఇంటర్నేషనల్ మార్కెట్‌లో డిమాండ్ ఉందని కొందరు అపోహలు సృష్టించారు. దీన్ని కొనుగోలు చేస్తే సంపద రావడంతోపాటు ఆరోగ్యం మెరుగుపడుతుందని, రూ.5 లక్షలు ఆ పైచిలుకు ధరకు విక్రయించేందుకు ఈ దందాకు తెరలేపారు. అడవిలో పట్టుకున్న అలుగు నుంచి కరెంట్ ఉత్పత్తి అయ్యేలా చూపేందుకు ఫేక్ టెస్టర్‌ను తయారుచేసి ఈ దందాను కొనసాగిస్తున్నట్లు గుర్తించారు.

10 మందిపై కేసు, అరెస్టు..

ఈ కేసులో ముందుగా నిజామాబాద్‌కు చెందిన ఫయాజ్, గంగాప్రసాద్‌తోపాటు జగిత్యాల జిల్లాకు చెందిన అహ్మద్‌ఖాన్‌ను పట్టుకుని విచారించారు. ఖానాపూర్ మండలానికి చెందిన గణేశ్, బారిక్ రావు, నాగేశ్, విజయ్, నాగారావు, ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం లింగట్లకు చెందిన శ్రీరాం, జగిత్యాల జిల్లా ఇస్లాంపూర్‌కు చెందిన రియాజ్ అహ్మద్‌ను గుర్తించి కేసు నమోదు చేశారు. వారి నుంచి 9 సెల్‌ఫోన్లతోపాటు ఒక కారు, బైక్, ఒక వెయింగ్ మిషన్, ఒక టెస్టర్, అలుగు పొలుసులు, ఒక అలుగును స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వారిని రిమాండ్ చేయనున్నారు. ప్రస్తుతానికి విచారణ కొనసాగుతుందన్నారు. సమావేశంలో డిప్యూటీ రేంజ్ అధికారి మహేశ్, ఎఫ్ఎస్‌వో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న ఫోన్లు, అలుగు అవశేషాలు, వెయింగ్‌మిషన్, టెస్టర్

మొరం తరలిస్తున్న టిప్పర్ సీజ్

సాత్నాల: మండలంలోని మేడిగూడ సమీపంలో అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై గౌతమ్ పవర్ తెలిపారు. పక్కా సమాచారంతో పోలీసుల ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. డ్రైవర్, యజమాని వద్ద ఎలాంటి ధ్రువపత్రాలు, అనుమతి లేకుండా మొరం అక్రమంగా తరలించడంతో టిప్పర్‌ను చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ మొరం అడ్డగుట్ట నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదు వచ్చిందన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఏఎస్సై స్వామి, టీసీ అఫ్జల్ ఉన్నారు.